విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శనివారం 31 ఆగస్టు 2024 8 పేజీలు

ఖరీఫ్ సాగుపై ఆశలు

ముండ్లమూరు మండలం ఉల్లగల్లులో శుక్రవారం వరినాట్లు వేస్తున్న రైతు

- జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షాలు
- మరో రెండు రోజులు వర్ష సూచన
- ఆరుతడి పంటలకు సాగర్ నీరు
- సన్నద్ధం అవుతున్న రైతన్న

ఖరీఫ్ సాగుపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రెండు నెలలుగా వర్షాలు లేక నిరాశజనకంగా ఉన్న రైతన్నల ముఖాల్లో చిరునవ్వు కనిపిస్తోంది. ఈ దఫా ఖరీఫ్ కచ్చితంగా కలిసొస్తుంది, లాభాలు తెస్తోందనే ఆశతో రైతన్నలు వ్యవసాయ పనులు ముమ్మరం చేస్తున్నారు.

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు :
బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో ఓ మోస్తరు వర్షపాతం నమోదైంది. అల్పపీడన ప్రభావంతో మరో రెండు రోజుల పాటు జిల్లాకు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. దీంతో జిల్లాలో ఖరీఫ్ సాగుపై రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క ఆరుతడి పంటలకు నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులకు నీరు విడుదల చేసినట్లు ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. మరోపక్క జిల్లాలో గురువారం రాత్రి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజుల పాటు జిల్లాకు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతాంగం ఖరీఫ్ సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. గత రెండు నెలల నుంచి జిల్లాలో అనుకున్న మేర వర్షం నమోదు కాకపోవడంతో రైతులు ఈ ఏడాది ఖరీఫ్ సాగుపై ఆశలు సన్నగిల్లాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాకు భారీవర్షాలు పడే అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడించడంతో ఖరీఫ్ సాగుపై ఆశలు రేకెత్తించాయి.

భారీ వర్షపాతం నమోదైతే వరి, మిర్చి, పొగాకు, ఇతరత్రా పంటలకు వాతావరణం సహకరించనుంది. నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో ఆరుతడిపంటలు వేసుకునేందుకు అనుమతులు రావడంతో సాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులు ఆరుతడి పంటలకు తమ భూములను చదును చేసుకొని సాగుకు సిద్ధమవుతున్నారు. ఇందుకు సంబంధించి సబ్సిడీ విత్తనాలు రైతులకు అందించేందుకు కూడా వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం మీద అల్పపీడన ప్రభావంతో జిల్లాలో ఖరీఫ్ సాగుపై రైతులు ఆశలు పెంచుకుంటున్నారు.

బాలినేని అవినీతిపై త్వరలో విచారణ

- సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు
- ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తే వదిలేది లేదు
- ఇది రాజకీయ కోణం కాదు
- జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డి అవినీతిపై త్వరలో ఎంక్వయిరీ జరుగుతుందని జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ పేర్కొన్నారు. ఒంగోలులోని జనసేన జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశంలో శుక్రవారం మాట్లాడారు. గతంలో హైదరాబాదులో బాలినేని మీడియా సమావేశంలో మాట్లాడుతూ తనపై ఉన్న అవినీతి ఆరోపణలపై విచారణ వేసుకోవచ్చని చెప్పారని గుర్తుచేశారు. బాలినేని కోరిక మేరకు ఆయన అవినీతిపై సాక్షాధారాలను ఇటీవల సీఎం చంద్రబాబుకి అందించామని తెలిపారు. ఎంక్వయిరీకి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

-విశాలాంధ్ర, ఒంగోలు

2లో

కాలుష్య రహిత పర్యావరణాన్ని భావితరాలకు అందిద్దాం

కలెక్టర్ వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : ప్రాణవాయువునిచ్చే చెట్లను, మొక్కలను కాపాడితే భావితరాలకు కలుషితం కాని పర్యావరణాన్ని అందించగలమని కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. శుక్రవారం సూర్యలంక ముత్తాయి పాలెంలో 'వనం-మనం' కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ వెంకట మురళి, జిల్లా సంయుక్త కలెక్టర్ బి.సుబ్బారావు, డీఆర్ఓ సిహెచ్ సత్తిబాబు, ఆర్డీవో జి.రవీందర్, జిల్లా అధికారులు మొక్కలు నాటారు. అనంతరం ఔషధ మొక్కలను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. అటవీ సంపద పెరిగితేనే ప్రజలకు మేలు జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. అడవులను నరికితే ప్రజలకు ఎంతో నష్టం వాటిల్లుతుందని, పర్యావరణానికి ప్రమాదం పొంచి ఉందన్నారు. భూభాగంలో కనీసం 33 శాతం అటవీ సంపద ఉండాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నప్పటికీ అభివృద్ధి పేరుతో చెట్లను నరికి వేయడం మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ రేంజ్ అధికారి బి.వి.రమణారావు, డిప్యూటీ రేంజ్ అధికారి వై.బాలకృష్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాగు, సాగునీటి కాలువల్లో హానికర వ్యర్థాలు

- అనారోగ్యాల పాలవుతున్న తీర ప్రాంత వాసులు
- సజ్జవారిపాలెం రహదారి మార్గం కంపుమయం
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు

తాగు, సాగు నీటి కాలువలో విష వ్యర్థాలు కలవటంతో తాగునీరు కలుషితం అవుతుందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. సజ్జవారిపాలెం రహదారి మార్గంలో రోడ్డుకు పక్కన పంట కాలువ ఉంది. ఇక్కడే రొయ్యలు, పీతలు, చేపలు, కోడి, గొర్రె, మేక లాంటి మాంసాహార వ్యర్థాలు తీసుకువచ్చి కుప్పలు కుప్పలుగా పడేస్తున్నారు. ఇటువైపుగా ప్రయాణించే ప్రయాణీకులు దుర్గంధంతో కూడిన వాసన పీల్చలేక పోవటం ఒక ఎత్తు కాగా, ఈ వ్యర్థాలు కుళ్లిపోయి పంట కాలువలో కలవటంతో ఈ నీరు విషపూరితంగా మారుతోంది. దీంతో తాము తాగే నీటితో రోగాల భారిన పడుతున్నామని దిగువ ప్రాంత ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

విశాలాంధ్ర - రేపల్లె :
రేపల్లె పట్టణం నుండి ఇసుకపల్లి మీదుగా గుడ్డికాయలంక అక్విడేట్ నుండి సజ్జవారిపాలెం రహదారి మార్గంలో వెళ్లాలంటే తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతోంది. పాదచారులు, వాహనదారులు, ముక్కు మూసుకుని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ రహదారి మార్గంలో చాలా కాలంగా రోడ్డుకి ఇరువైపులా పంట కాలువకు పక్కన పనికిరాని వ్యర్థాలు పడవేయటంతో ఆ వ్యర్థాలు కుళ్లిపోయి, తాగునీటి, సాగునీటి కాలువలో కలవడంతో తాగునీరు విషపూరితమై తీర ప్రాంత వాసులు వ్యాధుల బారిన పడుతున్నామని దిగువ ప్రాంత గగ్గోలు పెడుతున్నారు. రేపల్లె పురపాలక సంఘం పారిశుధ్య కార్మికులు వీధుల నుండి సేకరించిన చెత్తాచెదారాన్ని ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించకుండా ఇసుకపల్లి శివారు అక్కిలేరు వంతెన వద్ద చెత్తాచెదారం పోసి కుప్పలుగా వేసి తగులుపెట్టడంతో పొగ వ్యాపించి వాహనాదారులకు ఇబ్బంది కలిగించే విధంగా ఈ రహదారి మార్గం కనిపిస్తున్నది. అంతేకాకుండా డ్రైనేజీలలో ఉన్న మురుగును తీసి ఇక్కడ డంపింగ్ చేయటంతో మురుగు వాసనతో ప్రయాణికులు అసహనానికి గురవుతున్నారు. ఒకవైపు తీవ్రమైన దుర్గంధం, మరోవైపు గుంతల మయమైన రోడ్లతో వాహనదారులు ఇక్కట్లు వర్ణాతీతం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్విడేట్ వద్ద పేరుకుపోయిన చెత్త కుప్పలు, వివిధ రూపాలలో వచ్చిన వ్యర్థాలు తొలగించి కాలువ చివరి గ్రామీణ ప్రాంతాలకు ప్రవహిస్తున్న సాగునీటిని తాగునీటిని పరిశుభ్రంగా ఉంచాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

నేల తల్లికి పచ్చ బొట్లు

సాగర్ ఆయకట్టు కింద జోరుగా వరి నాట్లు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలో ఖరీఫ్‌లో వరి నాట్లు ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో సాగర్ ఆయకట్టుకింద, బోర్ నీటి సౌకర్యం ఉన్న రైతులు నాట్లు ప్రారంభించారు. సాగర్ నుండి నీరు విడుదలైన నేపథ్యంలో కాలువలో సమృద్ధిగా నీరు ప్రవహిస్తోంది. దీంతో ఆయకట్టు రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కాలువలు, బోర్ల కింద వరి నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. మండలంలోని ఉల్లగల్లు, లక్ష్మీ నగర్, పులిపాడు, శ్రీనివాస్ నగర్, రెడ్డి నగర్, బసవాపురం తదితర గ్రామాల్లో వరి నాట్లు జోరందు కున్నాయి. ఈ వారంలో వర్షాలు మరింతగా కురిస్తే వరి నాట్లు మరింత వేగం పుంజుకుంటాయి. సాగర్‌కు జలాలు రావడంతో ఉత్సాహంగా సాగు పనులు ప్రారంభించారు. దీంతో పంట పొలాలన్నీ రైతులు కూలీలతో కళకళలాడుతున్నాయి.

వెంకట కృష్ణమోహన్ సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర-సీఎస్‌పురం : సీఎస్‌పురం మండలం కోవిలంపాడు గ్రామానికి చెందిన పరంకుశం వెంకటకృష్ణమోహన్ శుక్రవారం పామూరు మండలంలోని లక్ష్మీనరసాపురం స్కూల్ నందు పదవి విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పాములపాటి మాదవ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత 35 సంవత్సరాల నుంచి ఉపాధ్యాయ వృత్తిలో ఉండి నేడు పదవీవిరమణ చేస్తున్న సందర్భంగా మాధవ ప్రసాద్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మాధవ ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఎంతోమంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీర్చిదిద్దిన పరంకుశం వెంకటకృష్ణమోహన్‌కు దక్కుతుందన్నారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు వెంకటకృష్ణమోహన్‌కు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మోపాడు మాజీ నీటి సంఘం అధ్యక్షులు అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, పువ్వాడి రామారావు, పాములపాటి లక్ష్మీనరసయ్య, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు షేక్ ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ పనుల పరిశీలన

విశాలాంధ్ర-పామూరు : పట్టణంలోని కందుకూరు రోడ్డులో మంచినీటి పైప్ లైన్ మరమ్మత్తుల పనులను శుక్రవారం పట్టణ రెండవ ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ పరిశీలించారు. మంచినీటి ఎద్దడి తీర్చేందుకు శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు అవసరమైన చోట పైపులైను ద్వారా మంచి నీరు అందిస్తున్నట్లు వెంకటేష్ తెలిపా రు. కార్యక్రమంలో నీరుకట్టు రసూల్, బూత్ కమిటీ ఇంఛార్జీస్ మెంట నరసింహారావు, మండ్ల రమణయ్య, మీనుగ శీను పాల్గొన్నారు.

డెంగ్యూ పట్ల అప్రమత్తంగా ఉండాలి

జిల్లా మలేరియా అధికారి శ్రావణ్

విశాలాంధ్ర-టంగుటూరు : డెంగ్యూ పట్ల అప్రమత్తంగా ఉండాలని టంగుటూరు ప్రాంతీయ ఆరోగ్య కేంద్ర సిబ్బందికి జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రావణ్ సూచించారు. శుక్రవారం టంగుటూరులోని ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ ఆరోగ్య కేంద్రం సిబ్బందికి గ్రామాలలో పారిశుధ్యం క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అలాగే డెంగ్యూ కేసులను తగ్గించే నివారణ చర్యలను చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అశోక్ సాగర్ సిహెచ్‌ఓ మాతయ్య మరియు ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

బాలినేని అవినీతిపై త్వరలో విచారణ

- **జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్**

విశాలాంధ్ర -ఒంగోలు : మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డి అవినీతిపై త్వరలో ఎంక్వయిరీ జరుగుతుందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ పేర్కొన్నారు. ఒంగోలులోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ గతంలో హైదరాబాదులో బాలినేని మీడియా సమావేశంలో మాట్లాడుతూ తలపై ఉన్న అవినీతి ఆరోపణలపై ఎంక్వయిరీ వేసుకోవచ్చని చెప్పారన్నారు. బాలినేని కోరిక మేరకు ఆయన అవినీతిపై సాక్షాదారాలు ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి అందించామన్నారు. దీంతో బాలినేనిపై ఎంక్వయిరీ కి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలో ఎంక్వయిరీ వేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. ప్రధానంగా బాలినేని పేదలకు ఇళ్ల స్థలాలు పేరుతో జింక్ ఫిక్స్ ఐరన్‌ఓర్ కంపెనీకి ఇచ్చిన ఎర్ర జర్ల కొండను అన్నీ తెలిసి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కొండను చదును పేరుతో రూ.40 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ధ్వజమెత్తారు. అంతేకాకుండా దాదాపు రూ. 65 కోట్ల విలువైన ఎర్రజర్ల కొండ మట్టిని తన వెయ్యంకుడి విల్లాసైన శ్రీకర కు తరలించ లేదా అని ప్రశ్నించారు. కేవలం ఎర్రజర్ల కొండ మట్టి తరలింపు పై రూ. 100కోట్లు అవినీతి జరిగిందన్నారు. శ్రీకరి విల్లాస్ లోని మట్టి నమూనాలు ల్యాబ్ కు తరలించేందుకు సిద్ధమా అని సవాల్ విసిరారు. అలాగే సార్వత్రిక ఎన్నికలకు ముందు ఒంగోలు నగర పరిధిలోని 25 వేల మంది పేద కుటుంబాలకు చీరతో సహా పట్టాలి ఇస్తానని హామీ ఇచ్చిన బాలినేని, ఒంగోలులో 24 వేల మందికి పట్టాలిచ్చారన్నారు. అయితే వీటిలో 12 వేల మందికి ఇచ్చిన పట్టాలు ఈపాటికి ఆస్తులు ఉన్న వారికే నన్నారు. ఒంగోలు నగరంలో వారి పేరుతో ఆస్తి పనులు కడుతున్న వారే అన్నారు. ఇప్పటికే 500 మందికి పైగా పేర్లను ముఖ్యమంత్రికి అందించడం జరిగిందన్నారు. మిగిలిన వారి పేర్లు కూడా త్వరలో అందిస్తామన్నారు. ఇల్లు లేని పేదవారికి ఇవ్వవలసిన ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ విషయంలో బాలినేని అధికార దుర్వినియోగం పాల్పడి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. అలాగే ఒంగోలులో భూ కబ్జాల విషయంలో బాల్ లేని తన హస్తం లేదని నిరూపించుకోవాలని అన్నారు. మంగమూరు రోడ్డు లోని బ్రాహ్మణుల భూకబ్జా విషయంలో సిఐడి ఎంక్వయిరీలో బాలినేని, అతని తనయుడు పేర్లు స్పష్టంగా ఉన్నట్లు సిఐడి వద్ద ఉన్న ఫైళ్లను ఓపెన్ చేయడం ద్వారా తెలుస్తుంది అన్నారు. అయితే నాకి ముఖ్యమంత్రి జగను బతిమిలాడుకుని కేసు బయటికి రాకుండా బాలినేని నీరు గార్చారన్నారు. ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎస్సీ ఎస్టీ బీసీలకు రావలసిన పారిశుధ్య ఉద్యోగాలను వైసిపి నాయకులు ఇళ్లల్లో పనిచేసే వారికి, నాయకుల స్నేహితుల కారు డ్రైవర్ల పేరుతో జీతాలు తీసుకుంటున్నారన్నారు. దాదాపు ప్రతి నెల రూ.25 నుండి 30 లక్షల జీతాలు పక్కదారి పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటన్నిటిపై బాలినేని శ్రీనివాసరెడ్డి అడిగిన మేరకు ఎంక్వయిరీ వేస్తున్నామని, ఇది రాజకీయ కక్ష సాధింపు కాదని అన్నారు. మీడియా వాళ్ళు అడిగిన ప్రశ్నకు సమాధానంగా జనసేన పార్టీలోకి వస్తున్న విషయం తన దృష్టిలో లేదన్నారు. అదంతా పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందన్నారు. పార్టీలు కి వచ్చినంత మాత్రాన బాలినేని పై అవినీతి పోరాటం ఆగదన్నారు.

పవన్ కళ్యాణ్ జన్మదిన పురస్కరించుకొని.....

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సెప్టెంబర్ 2వ తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జన్మదిన కార్యక్రమాల్లో భాగంగా సెప్టెంబర్ 1 ఆదివారం ఒంగోలులో ని గద్దల కుంట వద్ద శ్రీ మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మొక్కలు నాటి కార్యక్రమంలో చేపట్టనున్నట్టు తెలిపారు. అలాగే రెండవ తేదీన రక్తదాన శిబిరం, మొక్కలు నాటే కార్యక్రమం, పార్టీ సభ్యత్వం ఎక్కువగా చేసిన నాయకులకు సన్మాన కార్యక్రమం, కర్నూల్ రోడ్డు ఫ్లై ఓవర్ వద్ద డొక్కా సీతమ్మ పేరుతో అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రియాజ్ తెలిపారు. మీడియా సమావేశం కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి చనపతి రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు చిట్టెం ప్రసాదు, జిల్లా కార్యదర్శి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

- టీడీపీ నేత యారవ

విశాలాంధ-పామూరు : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని మండల టిడిపి నేత యారవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు.. శుక్రవారం వనం మనం కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యులు డాక్టర్ నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాలలో మొక్కలు నాటారు. మండల కేంద్రమైన పామూరు పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయంలో ఎన్డీఏ కూటమి నాయకులు మొక్కలు నాటారు. పడమర కట్టకింద పల్లె పంచాయతీ కార్యాలయంలో ఏపీ డి ఓ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. యారవ శ్రీనివాసులు మాట్లాడుతూ మీద జీవరాశి మనుగడకు మొక్కలు అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తాయని అన్నారు. ఒంగోలు పార్లమెంట్ కార్యదర్శి సయ్యద్ జమీర్ బాబు, మాజీ సర్పంచ్ డివి మనోహర్, బిజెపి నాయకులు కొండిశెట్టి వెంకటరమణయ్య పాల్గొన్నారు.

సోమ శేఖర్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర-ఒంగోలు : ఆంధ్ర కేసరి యూనివర్శిటీ సి.డి.సి. డీన్ డాక్టర్ జి.సోమశేఖరను గిద్దలూరుకు చెందిన పలు కళాశాలల అధినేతలు శుక్రవారం ఘనంగా సత్కరించారు. గిద్దలూరు లోని శ్రీ సరస్వతీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ అధినేత డాక్టర్ వి.బాలిరెడ్డి, హజరత్ అమిరుద్దిన్ బి.ఎడ్ కాలేజీ ప్రిన్సిపాల్ షేక్.చాంద్ బాషాలతో పాటు పలు బి.ఎడ్. కాలేజీల యాజమాన్యాల ప్రతి నిధులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలిరెడ్డి ప్రత్యేకంగా తయారు చేయించిన బొకేను డాక్టర్ సోమ శేఖరకు అందజేసి నూతనంగా భాధ్యతలు స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలి రెడ్డి మాట్లాడుతూ కొత్తగా నూతనంగా ఏర్పడిన ఆంధ్ర కేసరి విశ్వ విద్యాలయం అభివృద్ధి కోసం యూనివర్శిటీ అధికారులు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని తెలిపారు.

యాంటి డ్రగ్స్ విద్యా సంస్థగా ఏకేయూను తీర్చిదిద్దుదాం

- **ఏకేయూ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాజ మోహన్**
- **డాక్టర్ తేజో మూర్తి పవర్ పాయింట్ ప్రజెంటేషన్**

విశాలాంధ్ర-ఒంగోలు :

ఆంధ్ర కేసరి యూనివర్శిటీని డ్రగ్స్ లేని విద్యా సంస్థగా తీర్చి దిద్దేందుకు ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై పని చేయాలని ఆంధ్రకేసరి యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.రాజ మోహన్ అన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల తలెత్తే అనర్థాలను ప్రజలు ముఖ్యంగా యువత అవగాహనను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. శుక్రవారం స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీ సమావేశపు హాలులో జరిగిన యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమానికి ఏ.కే.యూ. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.రాజమోహన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో వ్యక్తులు మంచి కంటే చెడుకు ఎక్కువగా ఆకర్షితులు కావడం వల్లే అనేక ఇబ్బందులు ఎదురవు తున్నాయని, ఈ విషయంలో ప్రతి ఒక్కరూ ఎంతో జాగ్రత్త వహించాల్సి ఉందని అన్నారు. ఈ అవగాహనా సదస్సుకు మలినేని లక్ష్మయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తేజో మూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల జీవితాలే నాశనం అవుతాయని అన్నారు. మారక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు,మద్య పానీయం, పొగాకు, గుట్కా వంటివి వినియోగదారులలో అనారోగ్యాన్ని పెంపొందిస్తాయే తప్ప మనిషి ఆరోగ్యం విషయంలో కానీ, దేహ దారుఢ్యం విషయంలో గానీ ఎటువంటి మేలు జరుగదని పేర్కొన్నారు. డ్రగ్స్ వాడకానికి ముందు హీరోలుగా ఉన్న వ్యక్తులు డ్రగ్స్ వినియోగం అనంతర కమెడియన్లుగా మారుతున్నారని ఆయన అన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సభికులకు వివరించారు. సి.డి.సి. డీన్ డాక్టర్ జి.సోమ శేఖర మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల కేవలం వ్యక్తులే కాకుండా కుటుంబాలకు,కుటుంబాలే నాశనం అవుతున్నాయని ఇటువంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ డ్రగ్స్ వినియోగం లేని సమాజం కోసం కంకణ బద్ధులై పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 30 సంవత్సరాల కాలం నుంచి ఇక్కడ యాంటి ర్యాగింగ్, యాంటి డ్రగ్స్ కార్యక్రమాలు చేపడుతూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్నామని అందువల్లే ఆంధ్ర కేసరి యూనివర్శిటీ డ్రగ్స్ వినియోగం లేని విద్యా సంస్థగా విరాజిల్లుతోందని, ఇది హర్షించదగ్గ పరిణామమని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలా మణి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు డ్రగ్స్ వినియోగానికి సమాజం యావత్తూ దూరంగా ఉండాలని తమ ప్రసంగాల ద్వారా పిలుపు నిచ్చారు. ఏ.కే.యూ. ఎన్.ఎస్.ఎస్. కో-ఆర్డినేటర్ డాక్టర్ మండే. హర్ష ప్రీతం దేవ్ కుమార్ వందన సమర్పణతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. సమావేశం అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ తేజో మూర్తిని ఏ.కే.యూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజ మోహన్,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలా మణి, సి.డి.సి.డీన్ డాక్టర్ జి.సోమ శేఖర, ఆంధ్ర కేసరి యూని వర్శిటీ ఎన్.ఎస్.ఎస్.కో ఆర్డినేటర్ డాక్టర్ మండే.హర్ష ప్రీతం దేవ్ కుమార్, ఇంజనీరింగ్ విభాగం ఇన్చార్జి డాక్టర్ ఆర్ శ్రీనివాస్, డాక్టర్ పి వెంకట్రావు ఆయనను తదితరులు ఘనంగా సన్మానించారు.

నేడు ఇంటి వద్దకే పెన్షన్

ఎంపీడీవో నరసయ్య

విశాలాంధ్ర-కొమరోలు : మండల పరిధిలోని వృద్ధాప్య, వితంతు, వికలాంగుల మరియు అన్ని రకాల పెన్షన్లు ఒక్కరోజు ముందుగానే అనగా శనివారం ఉదయం 5 గంటలకు పంపిణీ చేయబడునని కొమరోలు ఎంపీడీవో నరసయ్య తెలియజేశారు. మండల పరిధిలోని గ్రామాలలో పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులు ఇంటి వద్దనే ఉండి పింఛన్ పంపిణీ చేయుటకు వచ్చే అధికారులకు అందుబాటులో ఉండి పింఛన్ తీసుకోవాలని ఆయన తెలిపారు.

వన మహోత్సవం

విశాలాంధ్ర-పెద్దారవీడు : శుక్రవారం వనమహోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దారవీడు మండలం ఏనుగుల దిన్నెపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ నందు అజ్లెస్ సంస్థ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా పిల్లలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయటం జరిగింది. ఆ తరువాత వనం మనం అంటూ నినదించి పిల్లలతో వనం మనం ఆకారంలో కూర్చోబెట్టడం జరిగింది. ఆ తరువాత స్కూలు ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడైనటువంటి ఊటుకూరి మధుసూదన్ రావు సార్ మొక్కను నాటడం జరిగింది. అలాగే మిగతా ఉపాధ్యాయులు వనమహోత్సవము రాష్ట్ర ప్రభుత్వము ప్రవేశపెట్టిందని ఈ యొక్క కార్యక్రమమును అందరిమీ ఇష్టంగా చేయాలని అలాగే మొక్కల పెంపకం అనేది ముందు తరాలకు చాలా ఉపయోగపడుతుందని తెలిపి ఉన్నారు. స్కూలు విద్యార్థిని విద్యార్థులు అలాగే ఉపాధ్యాయులు అందరూ పాల్గొనడం జరిగింది.

ఇంటింటి ఓటర్ల సర్వే పగడ్బందీగా చేపట్టండి

విశాలాంధ్ర-సంతనూతలపాడు : గ్రామాలలోని ఇంటింటి ఓటర్ల సర్వేలో బిఎల్ఓలు పగడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నందు శుక్రవారం బీఎల్ఓలకు అవగాహన సదస్సు కార్యక్రమం జరిగింది. తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఓటర్లు జాబితాలో చేర్పులు మార్పులపై పలు సూచన సలహాలు సూచించి అవగాహన కల్పించారు. ప్రతి ఇంటింటికి తిరిగి 18 ఏళ్ళు నిండిన యువత యువకులను తగిన ఆధారాలు తీసుకొని ఓటర్లుగా ఓట్ల జాబితాలో చేర్చాలని అంతే కాకుండా ఓటర్ల సర్వే వేగవంతంగా చేపట్టాలని కోరారు.

మొక్కలను సంరక్షించాలి

జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర-ఒంగోలు : మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టడం తో పాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై వుందని జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం ఒంగోలులోని కేంద్రీయ విద్యాలయంలో జరిగిన వన మహోత్సవ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల క్రిష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పారిశ్రామికీకరణ నేపధ్యంలో మరియు రోజు రోజుకు పెరుగుతున్న జనాభా, ఉష్ణోగ్రతలను దృష్టిలో వుంచుకొని పర్యావరణం సమతౌల్యాన్ని కాపాడడానికి మొక్కలను విరివిగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థి దశ నుండే విద్యతో పాటు మొక్కల పెంపకం యొక్క ఆవశ్యకతను తెలుసుకొనిమొక్కలు నాటే కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. ప్రతీ ఒక్క విద్యార్థి ఒక మొక్కను నాటి ప్రతి రోజు కొంత సమయాన్ని కేటాయించి వాటి సంరక్షణకు వారే బాధ్యత తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. ఈ నెల 29వ తేదీన నోబెల్ బహుమతి గ్రహీత, బాలల హక్కుల కార్యకర్త కైలాష్ సత్యార్థి కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటిన విషయాన్ని గుర్తు చేసారు. హరితాంధ్ర కోసం అడుగేద్దాం ప్రతి ఒక్కరం మొక్కలు నాటుదాం అనే నినాదంతో ప్రతి ఒకరు హరిత యజ్ఞంలో పాలు పంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ సోషల్ ఫారెస్ట్రీ సునీత, ఆర్డీఓ సుబ్బారెడ్డి, కనిగిరి అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీనివాసరావు, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ అబ్దుల్ అఫీజ్, 19వ డివిజన్ కార్పొరేటర్ వెంకటేశ్వర రావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్ రావు తదితరులు మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో మొక్కల పెంపకం యొక్క ఆవశ్యకతను వివరించారు.

ఈ సందర్భంగా మొక్కల పెంపకం ఆవశ్యకత పై నిర్వహించిన డ్రాయింగ్ వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జాయింట్ కలెక్టర్ మెమెంటోలను ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది, కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి ఆరోగ్యాన్ని పెంచండి

విశాలాంధ్ర-వెలిగండ్ల : చెట్లను నాటి ప్రజల ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని ప్రకాశం జిల్లా జడ్పిటిసి జడ్పిటిసి సంఘ అధ్యక్షులు వెలిగండ్ల జడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సచివాలయం వద్ద వన మహోత్సవం సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు అధ్యక్షతన నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనాలను పెంచడం వల్ల మొక్కలు వేపుగా పెరిగి ప్రజలకు ఆక్సిజన్ తోపాటు ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆయన తెలిపారు. ఈ వన మహోత్సవాన్ని గ్రామంలోని ప్రతి ఇంటికి తీసుకెళ్లి ఇంటింటి మహోత్సవంగా రూపుదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రరావు టిడిపి మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకట్రెడ్డి, నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, ఎంపీటీసీ చిలకల వెంకటేశ్వర్ రెడ్డి, బొబ్బ తిరుపతిరెడ్డి, లక్ష్మీ నారాయణ, ఏపీవో, మస్తాన్ రెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన లైన్‌మెన్

విశాలాంధ్ర-రాచర్ల : మండలంలోని అనుములవీడు గ్రామ ఎలక్ట్రికల్ లైన్ మ్యాన్ వినిహెచ్ రామలింగయ్య 20వేల రూపాయలు లంచం తీసుకుంటూ ఒంగోలు ఏసీబీ ధికారులకు పట్టుబడ్డారు. రాచర్ల మండలం అనుముల వీడు గ్రామంలో ఎలక్ట్రికల్ లైన్ మాన్‌గా వినిహెచ్ రామలింగయ్య పనిచేస్తున్నరు. ఫిర్యాది పొలంలో ట్రాన్సారం బిగించుట కొరకు ఫిర్యాదు వద్ద నుండి 20 వేల రూపాయలు లంచం తీసు కుంటుండగా ఒంగోలు ఏసిబి డిఎస్పి రెడ్ హ్యాండుగా పట్టుకొని అతని వద్ద నుండి 20వేల రూపాయలు లంచం డబ్బులు రికవరీ చేసినారు. ఏసీబీ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, ఇన్స్పెక్టర్ శేషు, ఎస్ఐలు జే.బీ.ఎన్ ప్రసాద్, షేక్.మస్తాన్ షరీఫ్ పాల్గొన్నారు.

ఆత్మ రక్షణకు మార్షల్ ఆర్ట్స్

విశాలాంధ్ర-ఒంగోలు : ఆత్మ రక్షణకు మార్షల్ ఆర్ట్స్ ఎంతగానో దోహదపడుతున్నాయని అటువంటి వాటిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పారిశ్రామిక వేత్త మండవమురళీకృష్ణ అన్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీన ఒంగోలు మహాలక్ష్మి కళ్యాణమండపంలో జరుగుతున్న ఇంటర్ స్టేట్స్ కరాటే ఛాంపియన్షిప్ పోటీల బ్రోచర్ను నగర ప్రముఖులతో కలిసి ఒంగోలు నిర్మల్ నగర్లోని తన కార్యాలయం నందు ఆవిష్కరించారు. సిద్ధార్థ కరాటే దు అకాడమీ నిర్వాహకులు నల్లూరి మోహన్ రావు ఆధ్వర్యంలో సెప్టెంబర్ ఒకటో తేదీ జరిగే ఇంటర్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలలో కర్ణాటక మహారాష్ట్ర తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాల నుండి సుమారు 600 మంది కరాటే విద్యార్థులు హాజరవటం గొప్ప విషయం అని పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేసేందుకు అందరు కృషి చేయాలనిపేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ కరాటే అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మండవ సుబ్బారావు, ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు దుగ్గినేని వెంకట్రావు మండవ సుందర్ సాయి నంబూరి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు కాశీభట్ల వేణుగోపాల్ సంస్మరణ సభ

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రముఖ కథ, నవలా రచయిత, సమాజంలోని చీకటి కోణాలను ఆవిష్కరించిన సాహిత్య కారుడు కాశీభట్ల వేణుగోపాల్ సంస్మరణ సభ ఈరోజు శనివారం సాయంత్రం 5:00కు ఒంగోలు శ్రీనగర్ కాలనీలోని డాక్టర్ మల్లవరపు రాజేశ్వరరావు భవన్ లో నిర్వహిస్తున్నట్టు జానుడి - సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ నూకతోటి రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నేనూ- చీకటి, తపన, అసత్యానికి ఆవల, చీకటిగీలు, అసంగతం, కాలం కథలు తదితర రచనలు చేసి పద్దెర చండీ దాస్ వంటి ప్రఖ్యాత రచయితల కోవలో విశేష సాహిత్య కృషి చేసిన వేణుగోపాల్ గురించి పలుగురు సాహిత్యవేతలు పాల్గొని ప్రసంగిస్తారని, సాహిత్య అభిమానులు పాల్గొనాలన్నారు.

ముందుగానే పెన్షన్ల పంపిణీ

విశాలాంధ్ర-పీసీపల్లి : ప్రతి నెలా ఒకటో తేదీన పంపిణీ చేసే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఈ నెల 31వ తేదీనే (శనివారం) పిసిపల్లి మండలంలో 4785 మందికి పంపిణీ చేయటం జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం ఉద్యోగులకు సెలవు దినం కావడంతో రాష్ట్ర మంత్రిమండలి సూచనలతో 31న పెన్షన్ల పంపిణీ చేస్తున్నారని తెలిపారు.

ఎమ్మార్వోని కలిసిన జనసేన నాయకులు

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు నూతన తహశీల్దార్ భాగ్యలక్ష్మిని శుక్రవారం జనసేన ప్రకాశం జిల్లా సంయుక్త కార్యదర్శి గజ్జలకొండ నారాయణ, జనసేన పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల కొమరోలు ఎమ్మార్వోగా భాగ్యలక్ష్మి బాధ్యతల స్వీకరించారు. అందులో భాగంగా జనసేన పార్టీ నాయకులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో సన్మానించారు.

విద్యుత్ సౌకర్యం కల్పించండి సారూ..

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండల కేంద్రమైన ముండ్లమూరులోని ఊరికి దూరంగా నూతనంగా ఏర్పాటు చేసుకున్న ఎస్టీ కాలనీకి త్వరగా విద్యుత్తు సౌకర్యం కల్పించాలని ఆ కాలనీవాసులు అధికారులను వేడుకుంటున్నారు. ఒక సంవత్సరం క్రితం కాలనీ ఏర్పాటు చేసుకొని 20 కుటుంబాల వారు అక్కడ చీకట్లో మగ్గుతున్నారు. ఆ కాలనీకి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని లక్ష్యంతో విద్యుత్ స్తంభాలు కొంతమేర వేశారు. మధ్యలో ఆగిపోయాయి. రాత్రి సమయం లో విష సర్పాలు ఇళ్లల్లోకి వస్తున్నాయని, వాటి బారిన పడి ఇబ్బందులకు గురి అయ్యే అవకాశం ఉందని అధికారులు స్పందించి విద్యుత్ పనులు త్వరితగతిన పూర్తి చేసి తమకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

విశాలాంధ్ర-కొమరోలు : తాటిచెర్ల మోటులో ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక అటవీశాఖ అధికారులు సిబ్బంది డిఆర్ఓ ఆనందరావు ఎఫ్బిఓ మౌలాలి సహకారంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు విరివిగా చెట్లు పెంచాలని ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటాలని విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తాటిచెర్ల సర్పంచ్ బొమ్మని రంగమ్మ ఎస్ఎంసి చైర్మన్ బొమ్మను శ్రీనివాసులు నాయుడు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు విరివిగా పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా ఆంజనేయులు బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-టంగుటూరు : మండల నూతన తహశీల్దార్‌గా ఆంజనేయులు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పాలడుగు విజేంద్ర ఆధ్వర్యంలో మండల వీఆర్ఏలు తహశీల్దార్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. వీఆర్ఏల సమస్యలను తెలియజేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఆఫీసు పరిధిలో సమస్యలను తానే పరిష్కరిస్తానని రాష్ట్ర పరిధిలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ సుందర్రావు నారాయణ ఏడుకొండలు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

విశాలాంధ్ర-ముండ్లమూరు : మొక్కలతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని ఎంపీడీవో ఆర్ జనార్ధన్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శుక్రవారం వనం మనం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని అన్నారు. మొక్కలతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చు అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పెంచాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సిహెచ్ భారతి, ఏపీవో కే నాగరాజు, ఏపీఎం ఎం హనుమంతరావు, సీసీ పి గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి

విశాలాంధ్ర-పుల్లలచెరువు : ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేస్తున్న ప్రతి పంటను గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఇ-పంట యాప్‌లో నమోదు చేసుకోవాలని పుల్లలచెరువు మండల వ్యవసాయాధికారిణి నిర్మలా దేవి సూచించారు. ఈ సందర్భంగా స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పంటల నమోదు వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసినప్పుడు, ప్రకృతి వైపరీత్యాల్లో పంట నష్టం జరిగినప్పుడు, పంట రుణాలు కావాల్సినప్పుడు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ

విశాలాంధ్ర-మద్దిపాడు : మండలంలోని అంకేపల్లి కూచిపూడి గ్రామాల నందు జిల్లా వనరుల కేంద్రం అధికారులు రైతులకు శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో ఆత్మ 2024-25 ఫార్మర్ ఓరియంటెడ్ యాక్టివిటీ కింద ప్రకృతి వ్యవసాయం మరియు భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం గురించిన అంశాలపై నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వివి శేషమ్మ మాట్లాడారు. ప్రస్తుతం రైతులు ఎరువులు, పురుగు మందులు విచక్షణ రహితంగా వాడడం వలన నేల, గాలి, నీటి కాలుష్యంతో పాటు సాగు ఖర్చులు పెరిగి రైతుకు నికర ఆదాయం తగ్గిపోయిందని తెలిపారు. కావున ప్రస్తుత పరిస్థితులపై రైతులు అవగాహన కలిగియుండి రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి సిఫారసు మేరకు మాత్రమే వినియోగించాలని తెలిపారు. సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు, జీవ శిలీంద్ర నాశినులు, వేప కషాయం లేదా వేప నూనె లాంటి ప్రకృతి వనరులను వినియోగించడంతో పాటు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని సూచించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ఎ.శైలజరాణి మట్టి నమూనా తీసే విధానము, మట్టి పరీక్షా ఫలితాలను అనుసరించి ఎరువుల వాడకం, సమస్యాత్మక భూముల యాజమాన్యం గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కే. మురళి వ్యవసాయంలో పంటలు పండించుటకు వాడే జీవామృతాలు, కషాయాలు గురించి వివరించారు. బీజామృతం, నీమాస్త్రం తయారు చేసే విధానం చేసి చూపించారు. మండల వ్యవసాయ అధికారి సి.హెచ్. వెంకటేష్ వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం గురించి తెలుగులో ప్రచురించిన కరదీపికలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు ఈర్ల చిన్నబాబు, బరిరి మణి కృష్ణ, గ్రామ రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తెలుగు భాషా పరిరక్షణ బాధ్యత ప్రజలదే

అన్నపురెడ్డి వీరారెడ్డి

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : శాసనాధారాల ప్రకారం క్రీ.శ ఒకటవ శతాబ్ది నుండే పాలకులచే గౌరవించబడిన మన మాతృభాష ఆదరణకోల్పోతుండడం విచారకరమని, తెలుగు పరిరక్షణ బాధ్యతను ప్రజలే స్వీకరించాలని విద్యావేత్త, శాసన పరిశోధకులు డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి అన్నారు. గిడుగు రామ్మూర్తి ఇన్మదినం సందర్భంగా స్థానిక శ్రీసాధన డిగ్రీ కళాశాలలో గురువారం సాయంత్రం జరిగిన తెలుగుభాషాదినోత్సవ ప్రత్యేక కార్యక్రమంలో డాక్టర్ వీరారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో శాఖాధ్యక్షులు డి.వినోద్ సంచాలకత్వంలో జరిగిన ఈ సదస్సుకు ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ అధ్యక్షత వహించారు. సాంస్కృతిక పరిరక్షణకు మాతృభాషా సాహిత్యాలు కీలకమని, మాతృభాషలు మృగ్యమైపోతే సమాజం విలువల విధ్వంసం వైపుకు నడుస్తుందని ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ వివరించారు. సాద్ సమన్వయకర్త భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం. శేషకుమార్ మాట్లాడుతూ ప్రతివ్యక్తికి ఆలోచనలు, ఆవిష్కరణలు, సృజనాత్మకత సొంతభాషలోనే వికసనం చెందుతాయని యునెస్కో ప్రకటించిందని, కాగా తెలుగు ప్రాంతాల్లో వైద్యవిజ్ఞానం, శాస్త్రసాంకేతికతలు తెలుగులోనికి మార్చే ప్రయత్నం జరగకపోగా పసిబిడ్డల ఆలోచనాశక్తినికూడా చిదిమివేసేలా ఆంగ్లమాధ్యమం రుద్దుతూ, తెలుగును బలవంతంగా పలచనచేయడం విచారకరమన్నారు. గిడుగురామ్మూర్తి స్ఫూర్తితో మున్ముందైనా తెలుగుభాషకు 'తగిన గుర్తింపు, గౌరవం కలగాలని ఇంటర్ విద్యవరకు తొలిప్రాధాన్యతా పాఠ్యాంశంగా తెలుగుకు వెలుగునిస్తూ కాన్వీయ విద్యలకు సైతం తెలుగులో ప్రామాణిక పాఠ్యపుస్తకాలు ప్రచురించే దిశగా ప్రభుత్వాలు చొరవతీసుకోవాలని, నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ ప్రకటించిన మాతృభాషల ప్రాధాన్యతను రాష్ట్రప్రభుత్వాలు అమలుపరచాలని, అందుకు ప్రజాచైతన్యం ఒక్కటే మార్గమని ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ పేర్కొన్నారు. అధ్యాపకులు డి.వినోద్, ఎం.వి. రాఘవేంద్ర, శ్రీధర్, బి. పోలిరెడ్డి, సి.సి.హెచ్ మురళి, జె. సాయి కార్యక్రమానికి నేతృత్వం వహించారు.

ప్రైవేట్ పాఠశాలల అధ్యక్షుడిగా సుధీర్ కుమార్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

విశాలాంధ్ర-రాచర్ల : గిద్దలూరు నియోజకవర్గ అపుస్మా ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజిమెంట్ అసోషియేషన్ అధ్యక్షులుగా రాచర్ల మండల కేంద్రంలో ఉన్న స్పందన విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్ కుమార్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అసోషియేషన్ ప్రతినిధులు మీడియాకు తెలిపారు. గురువారం సాయంత్రం జరిగిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సమావేశంలో గిద్దలూరు, కొమరోలు, రాచర్ల, కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాలలోని ప్రైవేట్ పాఠశాలల అధినేతలు పాల్గొని అపుస్మా నూతన కార్యవర్గ కమిటీ ఏర్పాటు చేయడమైనది. నూతన కమిటీ గౌరవాధ్యక్షులుగా జి.రత్నం బాబు వాసవి విద్యానికేతన్-కంభం అధ్యక్షులుగా పి.సుధీర్ కుమార్ రెడ్డి స్పందన హై స్కూల్ - రాచర్ల, ఉపాధ్యక్షులుగా కె.గౌరి క్రిష్ణా రెడ్డి యశ్వంత్ హై స్కూల్ - బేస్తవారిపేట కార్యదర్శిగా జడ్.చంద్ర శేఖర్ అరుణోదయ హై స్కూల్ - గిద్దలూరు సహాయ కార్యదర్శిగా జి.మధులత సాయి హర్ష యూ.పి.స్కూల్ - కొమరోలు కోశాధికారిగా కె.గణేష్ యాదవ్ అమరావతి యు.పి.స్కూల్ - ముళ్లపాడు, కార్యవర్గ సభ్యులుగా పి.మల్లికార్జున రెడ్డిపుల్లమ్మ యు.పి.స్కూల్ - పాపినేనిపల్లి, యస్.శ్రీనివాసులు కవిత హై స్కూల్ - అంబవరం ఎన్నికైనట్లు తెలిపారు. ఎన్నిక అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులుగా ఎన్నికైన సుధీర్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు నియోజక వర్గ ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అందరం కలిసి సమన్వయంతో పనిచేస్తామని, తనను అధ్యక్షునిగా ఎన్నుకున్న ఆరు మండలాల సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

'వనం-మనం'

విశాలాంధ్ర-టంగుటూరు : స్థానిక టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధి హామీ సిబ్బంది ఆధ్వర్యంలో వనం మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ పారిశ్రామికవేత్త టంగుటూరు మాజీ సర్పంచ్ బెల్లం జయంత్ బాబు, బెజవాడ వెంకటేశ్వర్లు, కామని విజయ్ కుమార్, జనసేన మండలాధ్యక్షుడు కందుకూరి రాంబాబు పాల్గొన్నారు. వనమహోత్సవంలో భాగంగా టంగుటూరు హై స్కూల్ గ్రౌండ్లో కొబ్బరి చెట్ల మొక్కలను నాటారు. వారు మాట్లాడుతూ భూమి మీద జీవరాశి మనుగడకు మొక్కలు అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తాయని అన్నారు. పర్యావరణంలో వస్తున్న మార్పులకు ప్రతి ఒక్కరూ ఒక మొక్కని నాటాలని పిలుపునిచ్చారు. వాటి సంరక్షణ కూడా విధిగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు సర్పంచ్ మద్దిరాల మమత, మండల పరిషత్ అధ్యక్షురాలు పటాపంజుల కోటేశ్వరమ్మ, ఏపీవో సుభాషిని ఫీల్డ్ అసిస్టెంట్ మరియు హై స్కూల్ సిబ్బంది ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి రూ.3.46 కోట్లు విడుదల

విశాలాంధ్ర-పర్చూరు: మండలంలో 20 గ్రామ సచివాలాల పరిధిలోని గ్రామపంచాయతీలకు పింఛన్ల పంపిణీ కోసం రూ.3.46 కోట్లు విడుదల చేశామని ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 5 గంటలకే పింఛను పంపిణీ ప్రారంభించాలని, సాంకేతిక సమస్య ఉన్నప్పుడు మాత్రమే తప్ప వందశాతం పూర్తిచేయాలని ఆదేశించారు. పింఛను పంపిణీని పరిశీలించటానికి గ్రామసచివాలయాల పరిధిలో ప్రత్యేక అధికారులను నియమించారని తెలిపారు. పర్చూరుకు ఎంపిడిఓ రామకృష్ణ, నూతలపాడుకు తహశీల్దార్ బ్రహ్మయ్య, ఉప్పుటూరుకు మండల విద్యాధికారి వెంకటరామయ్య, వీరన్నపాలెం, పోతుకట్లకు సిడిపీఓ సుభద్ర, ఎదుబాడుకు మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్, నాగుల పాలెంకు డీటీ నాగలక్ష్మీ, అన్నంభొట్లవారిపాలెంకు పీఆర్ ఏఈ శివయ్య, రమణాయపాలెం, గొల్లపూడికి ఏపీఓ బుల్లిబాబు, కొల్లావారిపాలెంకు ఏపిఎం లాజరు, అడుసుమల్లి, దేవరపల్లికి హౌసింగ్ ఏఈ రాజకుమార్, తిమ్మరాజుపాలెం,ఇనగల్లుకు ఈసీ శ్రీలత పింఛను పంపిణీని పరిశీలిస్తారని ఎంపిడిఓ రామకృష్ణ తెలిపారు.

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

విశాలాంధ్ర - కొరిశపాడు : మండల కార్యాలయ ఆవరణలో శుక్రవారం వనం మనం కార్యక్రమం ద్వారా పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు వాటిని సంరక్షించుకునే బాధ్యత మన అందరిదీ అని మండలాభివృద్ధి అధికారి డి.సురేష్ బాబు అన్నారు.కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు జాగర్లమూడి జయకృష్ణ మొక్కలు నాటి అందరి చేత నాటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ తమ తమ గ్రామాల్లో చెట్టును నాటి వాటి సంరక్షణ బాధ్యత స్వచ్ఛందంగా తీసుకోవాలని అప్పుడు మాత్రమే వాయు కాలుష్య నియంత్రించే విధంగా వాతావరణం ప్రజలకు అందించే ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు ఎంతో అభినందనీయులు న్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బూరుగులమ్మకు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణంలో వేంచేసి ఉన్న బూర్గులమ్మ గ్రామ దేవత అమ్మవారికి శ్రావణమాస నాలుగో శుక్రవారం సందర్భంగా అమ్మవారిని నెమలి ఈకలతో చీర అలంకరించి భక్తులకు దర్శన మిచ్చారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు ఆలయ అర్చకులు నందివెలుగు భాను సుధాకర్, గురుకుల్ ఆధ్వర్యంలో నిర్వహించి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు అమ్మవారిని దర్శించు కుని,అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.దేవాలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వరుణుడు కరుణతో రైతన్నల్లో ఆనందం

విశాలాంధ్ర - రేపల్లె : పంట కాలువలో వదిలిన సాగు నీరుకి తోడు వరుణ దేవుడు కరుణించడంతో పంట పొలాల్లో నీరు చేరడంతో వరి నాట్లు వేసుకుంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. చివరి భూములకు నీరు సమృద్ధిగా రావటంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.కొన్ని పంట పొలాలు నీరు లేక ఎండిపోతున్న తరుణంలో వర్షం కరుణించడంతో రైతులు ఊపిరిపోసుకున్నారు.గత వారం పది రోజులుగా తీరంలో ఎండిపోయిన వరి పొలాలు,వరుణుడు కరుణించడంతో పంట పొలాలు పచ్చగా కనిపిస్తున్నాయి. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో రైతులలో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వినాయక మండపాల ఏర్పాటుకు

పోలీసుల అనుమతి తప్పనిసరి

- నిబంధనల అనుగుణంగా పందిళ్లు ఏర్పాటు చేసుకోవాలి
- పోలీసుస్టేషన్‌లో కమిటీ వివరాలు అందించాలి
- ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలి

సీఐ మల్లికార్జునరావు

విశాలాంధ్ర - రేపల్లె : వచ్చే నెల 7న జరగబోయే వినాయక చవితి పండుగ సందర్భంగా పందిరి,మండపాలు ఏర్పాటుకు పోలీసులు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని రేపల్లె పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు.వినాయక విగ్రహ ప్రతిష్ట పందిళ్ళు,మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి ఐదు లేదా అంతకంటే ఎక్కువ మంది కమిటీగా ఏర్పడి వారి వివరాలు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లలో తెలిపి,వారి గుర్తింపు కార్డు నకలు కాపీలు, జత చేయాలని సీఐ తెలిపారు. ప్రైవేట్ లేదా పంచాయతీ,మున్సిపాలిటీకి సంబం ధించిన స్థలాలలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయదలచిన వారు ముందుగా సదరు ప్రైవేటు స్థలమైతే స్థల యజమాని అనుమతి,ప్రభుత్వ స్థలమైతే పంచాయతీ లేదా మున్సిపాలిటీ వారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సన్నారు. ఫైర్, విద్యుత్ శాఖల అనుమతి తీసుకొని వారు సూచించిన నియమ నిబంధనలకు అనుగుణంగా వినాయక చవితి పందిళ్ళు/మండపాలు వద్ద ఇసుక,నీళ్లను ఏర్పాటు చేసుకోవాలని, మండపాలలో దీపారాధనల వలన అగ్నిప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ జరుగకుండా వైరింగ్ జాగ్రత్తగా చేయించుకోవాలన్నారు.

విగ్రహాలఎత్తు,బరువు,ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, సమయం, నిమజ్జన మార్గం విగ్రహ నిమజ్జనానికి ఉపయోగించే వాహన వివరాలను విధిగా తెలియజేయాలని సీఐ సూచించారు. ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే సౌండ్ బాక్స్‌లను ఉపయో గించాలని,భద్రత కొరకు రాత్రి సమయాల్లో మండ పాల వద్ద విధిగా ఆర్గనైజింగ్ కమిటీ వారి ప్రతి నిధులు కాపలా ఉండాలన్నారు.

వినాయక పందిళ్ళు గాని,విగ్రహం పెట్టే ప్రదేశం గాని రోడ్డుపైన ఉండరాదు.బ్యానర్లు కాని,ఫ్లెక్సీలు గాని రోడ్డుపైన ప్రజల రాకపోకలకు ట్రాఫిక్‌కు అంత రాయం లేకుండా చూడాలన్నారు. ఊరేగింపు సమయంలో మందుగుండు సామాగ్రిని పేల్చడం చేయరాదన్నారు.పందిళ్ళ వద్ద,ఊరేగింపు సమయాలలో అనుచిత ప్రదర్శనలు,అసభ్య నాట్య ప్రదర్శనలు జరుగకుండా బాధ్యత వహించాలన్నారు. నిమర్జన ఊరే గింపుకు అనుమతించిన సమయం,నిమర్జనానికి కేటాయించిన ప్రదేశం, ఊరేగింపునకు మార్గము లాంటి నిబంధనలు కచ్చితంగా పాటించాలని తెలిపారు. నిమజ్జనానికి వెళ్లే వాహనంపై మద్యం లేదా మత్తు పదార్థాలను సేవించిన వారు లేదా మైనర్‌లు ఉండరాదన్నారు.

వెలుతురు ఉండగానే నిమజ్జన ప్రదేశానికి వెళ్ళాలన్నారు. ఊరేగింపు సమయంలో ట్రాఫిక్ ఇబ్బంది కలుగకుండా రద్దీని నివారించేందుకు భద్రత కొరకు తగినంత మందిని ఆ ఏరియా ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిబంధనలు పాటించేలా వినాయక విగ్రహ కమిటీ బాధ్యతా తీసుకోవాలని సీఐ సూచించారు.

సాంస్కృతిక కళావేదిక ప్రారంభం

విశాలాంధ్ర - వేటపాలెం : మండల పరిధిలోని అక్కయపాలెం గ్రామపంచాయతీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కళావేదికను శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి సమక్షంలో ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భవనం బద్రి రెడ్డి అధ్యక్షత వహించారు.సంఘం అధ్యక్షులు ప్రతి వెంకట సుబ్బారావు ముందుగా సరస్వతీ మాత విగ్రహం వద్ద పూజా కార్యక్రమం నిర్వహించారు. సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కళావేదికను ఐ.పురుషోత్తం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి పురుషోత్తం మాట్లాడుతూ ఇటువంటి కళావేదిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయడంతో, పాఠశాలలో జరుపుకునే కార్యక్రమాలు ఈ వేదిక మీద నిర్వహించుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు.ఈ సందర్భంగా ప్రతి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ సంఘం యొక్క ప్రధాన ఆశయము గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి కావలసిన వసతులు ఏర్పరచడమే ప్రధాన ధ్యేయం అన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బద్రి రెడ్డి ఆర్థిక సహకారం అందించిన సంఘం సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాఠశాలలో సరస్వతి విగ్రహము,కంప్యూటర్,ప్రింటర్,వాష్ బేసిన్లు ఏర్పాటు చేయుటకు దాతల సహకారం మరువలేనిదన్నారు.మా టెన్యూర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడానికి ముందు ఉంటామన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సుంకర వెంకట లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ సంఘం యొక్క ప్రధాన ఉద్దేశం గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు ఏర్పరచుట, సంఘ సభ్యులసహకారం మరువలేనిదన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ ఫౌండర్ సభ్యులు ప్రత్తి శరత్ బాబు,రావి మస్తాన్ రెడ్డి,మాలే వినీత్ రెడ్డి, గుడుమాటి శేఖర్ బాబు,పూల శ్రీనివాస రావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు,జయ రావు, శ్రీనివాసరెడ్డి,ఖమరున్నీస బేగం ,అనురాధ, బాల సుబ్రహ్మణ్యం,గ్రామస్తులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

విశాలాంధ్ర - అద్దంకి : ఉద్యోగులకు ఆమోదయోగ్యంగా లేని యుపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జగన్నాథం బాబురావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన యుటిఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా జగన్నాథం బాబురావు మాట్లాడుతూ సిపిఎస్,యుపిఎస్,జిపిఎస్ విధానాలను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు యుటిఎఫ్ పోరాటం చేస్తుందన్నారు. అనంతరం తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయ అధికారి శంకర్‌కు ఉపాధ్యాయ సంఘం నేతలు అందజేశారు. యూటీఎఫ్ నాయకులు సర్వేశ్వరరావు,బివి రత్నం,సాంబశివరావు, జాషువా, మస్తాన్‌వలి, దామా రామాంజనేయులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవాలి

- డిఆర్డీఏ బాపట్ల ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.పిచ్చి రెడ్డి



విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల మండల సమాఖ్య హాలులో జరిగిన సమీక్షా సమావేశంలో వికసిత్ భారత్ లక్ష్యాలను, రానున్న 100 రోజుల యాక్షన్ ప్లాన్,సంవత్సర లక్ష్యాలను నిర్దేశించి మహిళా సాధికారత సాధించాలని ఏపిఎంలకు డిఆర్డిఏ బాపట్ల ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.పిచ్చి రెడ్డి దిశా నిర్దేశం చేశారు.ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంఎఫ్ఎంఈ, పిఎంఈజీపి, ముద్రలోన్లపై సంఘ సభ్యులకు అవగాహన కల్పించి అర్హులైన లబ్ధిదారులకు వారు చేస్తున్న జీవనోపాదులకు ప్రోత్సాహకాలను అందించాలని వై.పిచ్చి రెడ్డి తెలిపారు. సమావేశం అనంతరం మండల సమాఖ్య ప్రాంగణంలో ఒక మొక్కలను నాటారు.ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించాలని తెలిపారు.ఈ సమీక్షా సమావేశంలో హెచ్.ఆర్ డిపియం సుబ్బారావు, ఫైనాన్స్ డీపీఎం రవి కుమార్,చేయూత డీపీఎం ప్రమీల,బ్యాంకు లింకేజీ డిపియం లక్ష్మణాచారి,స్త్రీనిధి ఏజీఎం నాగబాబు,జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి తమ్మాజీ,జిల్లా డిపియయి ఏపిఎంలు డి.సురేష్, ఫణిబాబు,చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఓపీఎస్ స్కీమ్ అమలు చేయాలి

విశాలాంధ్ర - రేపల్లె : కేంద్రప్రభుత్వం తీసుకోవచ్చిన యూపీఎస్ పెన్షన్ స్కీమ్ వ్యతిరేకిస్తూ ఉద్యోగులు అందరికీ (పాతపెన్షన్) ఓపిఎస్ అమలుచేయాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ అధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేస్తూ రేపల్లె మండల తహ సీల్దార్ ఎం.శ్రీనువాసరావుకు వినతి పత్రం అందజేశారు.యుపిఎస్ పెన్షన్ వద్దు ,పాత పెన్షన్ నే అమలు చేయాలి అంటు నినాదాలతో ర్యాలీగా తహసీల్దార్ ఆఫీస్ లో వినతిపత్రం అందించిన అనంతరం అంబేద్కర్ విగ్రహం ముందు నినాదాలతో నిం సన తెలిపారు.ఈ ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంవి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పెన్షన్ అనేటువంటిది ఉద్యోగుల హక్కు బిక్షకాదు కేంద్రప్రభుత్వం ఉద్యోగులపట్ల నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తుంది,సిపిఎస్ పేరుతో గతంలో ఉద్యోగులు దాచుకున్న వాటినే పెన్షన్ ఇస్తామన్నా కేంద్రప్రభుత్వం, ఇప్పుడు ఉద్యోగులకు ఏదో అదనంగా పెన్షన్ ఇస్తున్నట్లు యుపిఎస్ పేరుతో మోసం చేయడానికి సిద్ధమైందని విమ ర్శించారు.

ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా అధ్యక్షులు సిహెచ్.మణిలాల్ మాట్లాడుతూ కోట్లాదిమంది కార్మి కుల హక్కు అయినటువంటి పెన్షన్ పట్ల రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంలో అనేక హామీలు ఇచ్చి పాత పెన్షన్ అమలు చేస్తామని మోసం చేస్తుంటే ఇప్పుడు కేంద్రంలో యుపిఎస్ పేరుతో రాష్ట్రాల మీద బలవంతంగా ఉద్యోగులకి నష్టం చేసే పెన్షన్ తీసుకురావడం కుట్రపూరిత నిర్ణయం అని దీనిపై ఉద్యోగ కార్మిక సంఘాలు దేశవ్యాప్త ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు.ఈ నిరసన కార్యక్రమంలో ఐక్య ఉపా ధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ రేపల్లె పాత తాలూకా కమిటీల నాయకులు వి.సుబ్బారావు, రాజభూషణం, రాజేష్, జి.రవీంద్ర,రత్నబాబు, లక్ష్మ ణుడు,ఏలియా,వంగర శ్రీనివాసరావు,నాగరాజు,డి. శ్రీని వాసరావు,రహేమతుల్లా,డివైఎఫ్ఐ సీఐటీయు కెవి. లక్ష్మణరావు, కె. ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

విశాలాంధ్ర - అద్దంకి : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అద్దంకి మున్సిపాలిటీ పరిధిలోని భవాని సెంటర్లో దర్శి రోడ్డు డివైడర్ల మధ్య మున్సిపల్ ఆధ్వర్యంలో వివిధ రకాల మొక్కలు నాటారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మొక్కలు లేనిదే జీవరాశి మనుగడ లేదని అందుచేత ప్రతి ఒక్కరు వారి ఇళ్ల వద్ద పరిసరాలలో మొక్కలు నాటి వాటి సంరక్షణను బాధ్యతగా చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కంపా రజిని,ఏజెండ్ల నాగరాజు,మున్సిపల్ ఏఈ మరియదాసు,మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర - యద్దనపూడి : సెప్టెంబర్ 1న ఆదివారం సెలవు కావడంతో ఒక రోజు ముందుగానే పెన్షన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం నిర్ణయించినట్లు మండల టీడీపీ అధ్యక్షులు నల్లపనేని రంగయ్య చౌదరి,కనపర్తి నాగేశ్వరరావు,గుదే తారక రామారావు తెలిపారు.ప్రతి నెల 1వ తేదీన పంపిణీ చేసే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను,ఆగస్టు 31వ తేదీనే పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.సెప్టెంబర్ 1వ తేదీన ఆదివారం కావడం,ఆ రోజు ఉద్యోగులకు సెలవు దినం కావడంతో ఈ నిర్ణయం తీసుకుందన్నారు.గ్రామాల్లో లేకపోవడంతో పెన్షన్లు ఆగస్టు 31వ తేదీన పెన్షన్లు అందకపోతే సెప్టెంబర్ 2వ తేదీన సోమవారం అందరికీ అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు ఆయా గ్రామాలలో ఉండి నూరు శాతం పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ప్రమాదంలో కారు దగ్ధం

విశాలాంధ్ర-కొల్లూరు : రహదారిపై ప్రయాణిస్తున్న కారు ప్రమాద వశాత్తు దగ్ధమైన సంఘటన కొల్లూరు మండలపరిధిలోని క్రాప అడ్డరోడ్డు సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు ప్రకారం శుక్రవారం వేమూరుకు చెందిన పాముల అనీల్ అనే వ్యక్తి తన కుమార్తె, మరో యువకుడితో కలిసి కొల్లూరు వైపు తన కారులో వస్తున్నాడు. అకస్మాత్తుగా కారులోంచి పొగలు రావడంతో కారుని ఆపి పరిశీలించేందుకు ప్రయత్నించగా అప్పటికే మంటలు కారు మొత్తం వ్యాపించాయి. వెంటనే కారులో ఉన్న వ్యక్తులు బయటకు దిగడంతో పెను ప్రమాదం తప్పింది. మంటల కారణంగా కారు పూర్తిగా దగ్ధమయ్యింది. రేపల్లె-తెనాలి ప్రధాన రహదారిలో ప్రమాదం చోటుచేసుకోవడంతో కొద్ది సమయం ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించండి

మున్సిపల్ చైర్ పర్సన్ కట్టమంగ

విశాలాంధ్ర - రేపల్లె : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని రేపల్లె మున్సిపల్ చైర్ పర్సన్ కట్టమంగ అన్నారు.శుక్రవారం రేపల్లె పురపాలక సంఘ ఆధ్వర్యంలో పట్నంలోని 25వ వార్డులోని చిన్న మసీదు సెంటర్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ కట్ట మంగ,కమిషనర్ బిఆర్ఎస్ శేషాద్రిలు ప్రా రంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లా డుతూ మానవ మనుగడకు మొక్కలు, చెట్లు ఎంతో దోహదపడతాయని ప్రతి ఒక్కరు తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటాల్సిన బాధ్యత ఉందని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాల న్నారు.రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రోజు వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఇచ్చిన ఆదేశాల మేరకు పట్నంలోని 25 వార్డులో చిన్న మసీదు సెంటర్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని కమిషనర్ శేషాద్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ ప్రశాంత్ కుమార్,మున్సిపల్ డిఈఈ శివరామకృష్ణ,ఏఈ రోహిణి,మున్సిపల్ ఆర్ఐవై ప్రసాద్,వార్డు కౌన్సిలర్ షేక్ అప్సనా జమీర్,పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు,కోఆప్షన్ సభ్యులు,శానిటేషన్ ఇన్ఛార్జి అధికారి సురేంద్ర కుమార్,వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

డాక్టర్ గ్లోరి యానెట్ సాపాటి

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పెంచాలని మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానెట్ సాపాటి అన్నారు.వనమహోత్సవంలో భాగంగా సీఎంచంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మొక్కలు నాటుతున్న సంఘీభావంగా శుక్రవారం మండలంలోని సంగుపాలెంలో మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానెట్ సాపాటి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాకు దండలు, బొకేలు వద్దు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుదాం అని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ నినాదం మేరకు గ్రామంలో శుక్రువారం మొక్కలు నాట డం జరిగిందన్నారు.ప్రతి ఒక్కరు విధిగా ఒక్క మొక్క అయినా నాటి దానిని పెంచే నిర్వహణ తీసుకోని పర్యావరణాన్ని కాపాడాలని చెప్పారు.కృత్రిమ ఆక్సిజన్ వద్దు,మొక్కల ఆక్సిజన్ ముద్దు అని,పీల్చుకొనే గాలిని కొను క్కొనే పరిస్థితికి రాకుండా ప్రతి ఒక్కరం కృషి చేద్దాం అని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్ర మంలో పార్టీ నాయకులు బర్మా బుల్లియ్య, చెరుకూరి యాదయ్య,తోడేటి కిషోర్,బర్మా జాన్ బాబు,చందోలు రవి,జాన్ సైమన్,మాట్లాపూడి ప్రసన్న,చెరుకూరి సంపత,బర్మా ఝాన్సీ కుమ్మరిగుంట చరణ్,పంచాయతీ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి

- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మందా జనార్ధన్

విశాలాంధ్ర - వేమూరు : భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేమూరు నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందా జనార్ధన్ విజ్ఞప్తి చేశారు.శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన వేమూరులో సభ్యత్వ నమోదు కార్యక్రమంపై విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వ నమోదు కలిగిన ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో మూడో పర్యాయం అధికారం చేపట్టిన బిజెపి ప్రభుత్వం ప్రజా సంక్షేమం ధ్యేయంగా పనిచేస్తూ దేశ ప్రతిష్టను కాపాడే విధంగా పనిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి యల్లమాటి దాసు, మండల పార్టీ అధ్యక్షుడు వెలివెల సాంబశివరావు,పెనుమూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

విశాలాంధ్ర - బాపట్ల : మండలంలోని చెరువు జమ్ములపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ లో శనివారం జాతీయ క్రీడా దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జాతీయ బీసీ సంఘం జాయింట్ సెక్రెటరీ, ఫుట్ బాల్ రాష్ట్ర సెక్రటరీ కె.క్రాంతి కుమార్ పాల్గొన్నారు. వివిధ ఆటల పోటీల్లో గెలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు,బహుమతులు అందజేశారు. ఈ సభలో ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు,గ్రామ సర్పంచ్ బోనా వెంకటేశ్వర మ్మ, ఏఎంసీ చైర్మన్ నాగరాజు, కిషోర్,శ్రీనివాసరావు, మురళీకృష్ణ, బసంత్ కుమార్,హరిబాబు,ఉపాధ్యాయులు వీరచంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సై రవీంద్రని కలిసిన శంకర ప్రసాద్

విశాలాంధ్ర - కర్లపాలెం : కర్లపాలెం ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రవీందర్ను యానాది హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు తిరువీధుల శంకర్ ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో,పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర కాపునాడు సేవా సమితి జిల్లా అధ్యక్షునిగా నాగేశ్వరరావు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రాష్ట్ర కాపునాడు సేవా సమితి జిల్లా అధ్యక్షునిగా చీరాల నియోజకవర్గ కాపు నాయకులు లక్కాకుల నాగేశ్వరరావుని జాతీయ అధ్యక్షుడు మల్లెల శివ నాగేశ్వరరావు నియామక ఉత్తర్వులు ఇచ్చారు.ఒక సంవత్సర కాలం జిల్లా అధ్యక్షునిగా కొనసాగనున్నారు.ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.ఆయనకు పోలుదాసు రామకృష్ణ,మామిడాల శ్రీనివాసరావు, కాపునాడు సేవా సమితి సభ్యులు అభినందనలు తెలిపారు.

కాలుష్య నివారణకు మొక్కలు నాటాలి

విశాలాంధ్ర - పర్చూరు : వాతావరణ కాలుష్య నివారణకు మొక్కలు నాటాలని ఉపాధి హామీ పథకం ఏపీవో బుల్లియ్య తెలిపారు.మండలంలోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో వనం మనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.ఆయన మాట్లాడుతూ మొక్కలను పరిరక్షించాలని, వాటిని పెంచే బాధ్యత విద్యార్థులు తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ ఆఫ్ రెసిడెన్సి శివరామ్,ప్రిన్సిపాల్ విశ్వరాణి, ఈఓఆర్డి రామకృష్ణ,టీచర్స్, ఉపాధి హామీ పథకం సిబ్బంది ఉన్నారు.

నేడు మండలంలో పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర - నిజాంపట్నం : ఈ నెల 31వ తేదీన మండలంలోని పింఛను లబ్ధిదారులకు పింఛను సొమ్మును పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ ఎన్.నాగలక్ష్మి తెలిపారు.శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు,సచివాలయం సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 31వ తేదీ శనివారం ఉదయం నుంచి పింఛను సొమ్మును పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.పింఛనుదారులు అందుబాటులో ఉండాలని కోరారు.ఎవరైనా 31వ తేదీన పింఛను తీసుకోకపోతే సెప్టెంబర్ 2వ తేదీన లబ్ధిదారులందరికీ పింఛను పంపిణీ చేస్తున్నట్లు తెలియజేశారు ఈ సమావేశంలో మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రమేష్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

విశాలాంధ్ర - బల్లికురవ : పొట్టకూటి కోసమే రాష్ట్రాల దాటి వచ్చి చిరు వ్యాపారం చేసుకుంటూ బతుకుతున్న యువకుడు విద్యుత్ శాఖతో మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది.వివరాలలోకి వెళ్తే మండల కేంద్రమైన బల్లికురవ నాలుగు రోడ్ల కూడలిలో గత కొంతకాలంగా లక్ష్మణ్ 18 సంవత్సరాలు రాజస్థాన్ రాష్ట్రం జోధ్పూర్ గ్రామం నుంచి వచ్చి సమోసాల వ్యాపారం చేసుకుంటు జీవిస్తున్నాడు.శుక్రవారం సాయంత్రం బంకులో లైట్ వేసేందుకు స్విచ్ ఆన్ చేయబోవుగా ఒకసారిగా బంకుకు విద్యుత్ సరఫరా అవడంతో విద్యుత్ షాక్ కు గురై అక్కడే కుప్పకూలిపోయాడు.దీంతో స్థానికులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించారు.108 వాహనం సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని లక్ష్మణ్ ను మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లారు. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు లక్ష్మణ్ మృతి చెందినట్లు తెలిపారు.

బీజేపీ సభ్యత నమోదుపై సమావేశం

విశాలాంధ్ర-కొమరోలు : సెప్టెంబర్ 2వ తేదీ నుంచి ప్రారంభం కానున్న భారతీయ జనతా పార్టీ సభ్యత్వం నమోదుపై జిల్లా కార్యదర్శి పాతకోట బ్రహ్మానంద రెడ్డి, కొమరోలు బిజెపి అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, సభ్యత పరిశీలకుడు మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ సభ్యత్వంపై మాట్లాడారు. అధిక సంఖ్యలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వం ప్రజలు తీసుకునేలా కార్యకర్తలందరూ పనిచేయాలని తీర్మానించారు. కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేయాలని జిల్లా కార్యదర్శి పాతకోట బ్రహ్మానందరెడ్డి మండల అధ్యక్షుడు, వెంకటరామిరెడ్డి కార్యకర్తలను కోరారు.ఈ కార్యక్రమంలో కొమరోలు మండల ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, శ్రీను, సందీప్, రామచంద్ర పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

☞మార్టూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ

☞రోడ్డు ప్రమాదాలను తగ్గించడంపై దృష్టి సారించాలి

☞జిల్లా ఎస్పీ తుషార్ డూడి

విశాలాంధ్ర - మార్టూరు : గంజాయి అక్రమ రవాణా,విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీసు అధికారులను ఆదేశించారు.శుక్రవారం మార్టూరు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు.స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో ఎక్కువగా జరిగే నేరాల గురించి వాటి దర్యాప్తును ఏ విధంగా నిర్వహిస్తున్నారనే విషయాలు మార్టూరు సీఐని అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడి వారు నిర్వహిస్తున్న విధులు,శాఖపరంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఎస్పీ మాట్లాడుతూ నేరాలను నియంత్రించడానికి,గంజాయి ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు.ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసినప్పుడు దొంగతనాలకు గురైన వాహనాలు,గంజాయి,మద్యం అక్రమ రవాణాకు పాల్పడే వారు పట్టుబడే అవకాశం ఉంటుందన్నారు.రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రోడ్డు భద్రత నియమాల గురించి,మోటార్ వాహన చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారికి హెల్మెట్ యొక్క ఆవశ్యకత గురించి,దానిని ధరించడం వలన రోడ్డు ప్రమాదానికి గురైనప్పుడు శిరస్సుకు ఏ విధంగా రక్షణగా ఉంటుందనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు.రాత్రి సమయాలలో గస్తీ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. దాబాలు, రెస్టారెంట్లు,హోటళ్ళు ఇతర బహిరంగ ప్రదేశాలలో ఎవరైన మద్యం సేవిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.కేసుల విచారణ వేగవంతంగా నిర్వహించాలని,పెండెన్సి తగ్గించాలన్నారు.పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదిదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు.పోలీస్ సిబ్బందికి శాఖ పరమైన సమస్యలు ఉంటే వాటిని స్వయంగా వెల్లడించ వచ్చునని,వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన, పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగే విధంగా వ్యవహరించిన శాఖ పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు మార్టూరు సీఐ ఎమ్.శేషగిరిరావు,ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఎల్ రాజశేఖర్ డిమాండ్

విశాలాంధ్ర-ఒంగోలు : రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని, గత ప్రభుత్వం తీసుకున్నా నిర్ణయాలను అమలు చేస్తుందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. రాజశేఖర్ ప్రభుత్వం మీద ధ్వజమెత్తారు. విద్యారంగ సమస్యల పరిష్కారం చేయాలని పీడీఎస్‌యూ ప్రకాశం జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు తక్కువగా ఉన్నారని సాకుతో వాటిని మూసివేయడానికి ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 84,85, 117లను రద్దు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా 16, 000 ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయన్నారు. కనుక తక్షణమే ఈ జీవో లను రద్దుచేసి మూసివేసిన పాఠశాల లను తిరిగి ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు సిహెచ్ శ్యామ్, అన్వేష్, బాలు, సురేష్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

1న ఉచిత గుండె వైద్యశిబిరం

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలోని పంచాయతీ ఆవరణలో వచ్చే నెల 1న తెలుగుయువత ఆధ్వర్యంలో విజయవాడ హెల్ప్ వైద్యశాల సహకారంతో గుండెకు సంబంధించి ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈశిబిరం నందు గుండెకు సంబంధించి ఇజిసి ఇ సి హెచ్ ఓ పరీక్షలు నిర్వహిస్తారన్నారు ఈశిబిరంలో గుండె ఆపరేషన్ నిర్ధారణ అయినవారికి 12500 రూపాయలు విలువైన యాంజియోగ్రఫీ నిర్వహించి ఆపరేషన్ అవసరమైన వారికి ఎన్ టి ఆర్ ఆరోగ్యశ్రీ పదకంద్వార విజయవాడ హెల్ప్ వైద్యశాలలో ఉచితంగా ఆపరేషన్ చేయబడుతుందని తెలిపారు. వివరాలకు కాట్రగడ్డ చంద్రబాబు 9491316427,బెల్లం వెంకటేశ్వర్లు 9347105016, బాలిశెట్టి నాగేశ్వరావు 63004 90174,బెల్లం శేషారావు 9912059257లను సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా 'వనం-మనం'

విశాలాంధ్ర-కొమరోలు : వనం మనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఆధ్వర్యంలో రాజుపాలెంలోని కస్తూర్బా గాంధీ జూన్ బాలికల కళాశాలలో ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కుమార్ ఆదేశాల మేరకు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మన పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంనకు స్థానిక ఎంపీడీవో డి నరసయ్య ఏపీవో ఆర్ మహాలక్ష్మి తెలుగుదేశం పార్టీ నాయకులు గోడి ఓబుల్ రెడ్డి ప్రిన్సిపాల్ ఎం రాజు సులోచన ఈసీ కోటిరెడ్డి కటారి శ్రీనివాసులు లక్ష్మీరెడ్డి పంచాయతీ సెక్రటరీ తిరుమలరెడ్డి సచివాలయం సిబ్బంది ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు విద్యా కమిటీ చైర్మన్ పాల్గొనడం జరిగింది.

మొక్కల పెంపకం అందరి బాధ్యత

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని పోలవరం గ్రామ న్యూ ప్రాథమిక పాఠశాలలో ఆ పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ తూమాటి బుక్కయ్య మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పర్వతం రమణారెడ్డి మాట్లాడుతూ మొక్కల పెంపకం బాధ్యత అందరి బాధ్యత అని అన్నారు. మొక్కలు నాటిన దగ్గర నుండి వాటిని పెంచే బాధ్యత ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలన్నారు. మొక్కల వలన కలిగే ఆరోగ్య సూత్రాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఫణిదం శ్రీనివాసరావు, ఒగేటి శ్రీనివాసరావు, జిల్లా టిడిపి పార్లమెంట్ అధికార ప్రతినిధి కొర్రపాటి బుచ్చిబాబు, రావెళ్ల శ్రీనివాసరావు, కిలారి ప్రసాద్, పరుచూరి హనుమంతరావు, కిలారి అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయునికి సన్మానం

విశాలాంధ్ర-పామూరు : ఉద్యోగస్తులకు పదవీ విరమణ తప్పదని మండల టిడిపి నాయకులు ఎంపీటీసీ బొల్లా నరసింహారావు అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీ నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ పనిచేస్తున్న పరాంకుశ కృష్ణమోహన్ కు పదవీ విరమణ సన్మానం కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన నరసింహారావు మాట్లాడుతూ కృష్ణమోహన్ తన పదవీకాలంలో ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారని కొనియాడారు. అంకిత భావంతో పని చేసే ఉపాధ్యాయులకు సమాజంలో మంచి గౌరవం, గుర్తింపు లభిస్తుందన్నారు. కృష్ణ మోహన్ శేష జీవితం ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ల సంతోషముగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ దంపతులను శాలువ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమంలో మండల టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు డోలా శేషాద్రి, తడికమల్ల సుబ్బారావు, గుత్తి మహేష్, డోలా శ్రీనివాస్, శేషం మోషే తదితరులు పాల్గొని కృష్ణమోహన్ కు పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాదకరంగా పొన్నాల కాలువ

విశాలాంధ్ర - కర్లపాలెం : మండలంలోని నర్రావారిపాలెం, తుమ్మలపల్లి గ్రామాల మధ్య ఉన్న పొన్నాల కాలువ భారీ వర్షాల దెబ్బకు ప్రమాదకరంగా ప్రవహిస్తుంది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి కురిసిన భారీ వర్షానికి కాలువ ప్రమాదకర రీతిలో వంతెన పైనుంచి నీరు ప్రవహిస్తుంది. కర్లపాలెం మండలంలో 35.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఇరు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి. ఆక్వా రైతులు వ్యవసాయదారులు కూలీలు రాకపోకలు సాగించాలంటే భయపడిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మానవ మనుగడకు, జీవనానికి మొక్కలే ఆధారం అని చీరాల ఆర్డీఓ సూర్యనారాయణ రెడ్డి అన్నారు. చీరాలలో మనం, వనం కార్యక్రమాన్ని మండలంలోని వాడ రేవు రోడ్డులో ఉన్న అటవీ ప్రాంతం నగరవనం పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా వాతావరణం కలుషితం కాకుండా చూడవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడంతో పాటు వాటి ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీరాల మునిసిపల్ కమిషనర్ కె. చక్రవర్తి, సెక్షన్ ఆఫీసర్ జాన్సన్, రాగమ్మ, శిరీష, నాగమణి, సీ. హెచ్ వేణు గోపాలరావు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

విశాలాంధ్ర - కర్లపాలెం : ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ వాహనదారుడు వాహనాలను నడపాలని శుక్రవారం కర్లపాలెం ఐలాండ్ సెంటర్లో ఎస్సై రవీంద్ర అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అంతేకాకుండా ట్రాఫిక్ నియమాల పాటిస్తూ వాహనాలు నడపాలని వాహనదారులకు తెలియజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం: ఎంపీడీవో

విశాలాంధ్ర - చీరాల రూరల్ : వర్షాలు కురుస్తున్న ప్రస్తుత తరుణంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ నేతాజీ అన్నారు. మండలంలోని రామకృష్ణా పురం సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ఓడీఎఫ్ సర్వే పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్ టీ ఆర్ భరోసా పింఛన్లను 31వ తేదీనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. పంచాయితీలో పారిశుధ్యంపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు పరచాలన్నారు. చెత్తను సేకరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మురుగు నీరు నిలువ లేకుండా చూడాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లి, ఆయిల్ బాల్స్ వేసి దోమలను కట్టడి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటాం

- సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం
- పోలీసుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం
- జిల్లా ఎస్పీ తుషార్ డూడి

విశాలాంధ్ర - బాపట్ల : పోలీస్ ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటూ వారి సంక్షేమానికి ప్రాధాన్య తనిస్తామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. పోలీసు సంక్షేమంలో భాగంగా జిల్లాలో సర్వీసులో ఉంటూ వివిధ కారణాలతో మృతి చెందిన పోలీసు ఉద్యోగుల కుటుంబ సభ్యులతో, పోలీసు శాఖలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన పోలీసు ఉద్యోగులతో ప్రత్యేకంగా సమావేశమై, వారి వ్యక్తిగత సమస్యలు, ప్రభుత్వం నుండి రావల్సిన బకాయిలు, రాయితీలు గురించి సమీక్షించారు. ప్రభుత్వం నుండి రావాలసిన భధ్రత, జిపిఎఫ్, ఏపిజి ఎల్ఐ, చేయూత, విడో ఫండ్, కార్పస్ ఫండ్, అడిషినల్ కార్పస్ ఫండ్, గ్రూఫ్ ఇన్సూరెన్స్ స్కీమ్, లీవ్ ఎన్ క్యాష్ మెంట్ నగదు రాయితీలు సకాలంలో అందుకున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుండి బకాయి ఉన్న వాటి ప్రస్తుత స్థితిగతులను గురించి పోలీసు కార్యాలయ ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన చర్యలు చేపట్టాలని కార్యాలయ ఉద్యోగులను ఆదేశించారు. ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ ఉద్యోగులకు, సర్వీసులో ఉంటూ మృతి చెందిన పోలీసు ఉద్యోగుల కుటుంబసభ్యులకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైతే స్వయంగా తమకు తెలపవచ్చని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ భరోసా ఇచ్చారు. అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్, ఎ.ఓ బి.శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్.ఐ శ్రీనివాస్ రెడ్డి , బి పే సెక్షన్ సూపరింటెంట్ బి. రాధ, ఏ సెక్షన్ సూపరిండెంట్ షేక్. కరీముల్లా షావలి, సిబ్బంది, ఉద్యోగ విరమణ చేసిన పోలీసు ఉద్యోగులు, మరణించిన పోలీసు ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విజయలక్ష్మిపురంలో కోతుల బెడదను అరికట్టాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర - బాపట్ల : పట్టణంలోని పలు ప్రాంతాల్లో అధిక సంఖ్యలో కోతులు సంచరిస్తూ ప్రజలను, రోడ్డుపై వెళ్లే ప్రజలను, వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని మున్సిపల్ అధికారులు కోతులను అరికట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ తెలిపారు. ప్రధానంగా పట్టణంలోని విజయలక్ష్మీపురంలో కోతుల బెడద అధికంగా ఉందన్నారు. పాఠశాలలకు ద్విచక్ర వాహనంపై తమ పిల్లలను తీసుకువెళ్తున్న వారిపై కోతులు దాడి చేయడంతో గాయాలు భారీన పడుతున్నారన్నారు. తాజాగా శుక్రవారం ఓ వ్యక్తి తన కుమారుడిని ద్విచక్ర వాహనంపై తీసుకుని వెళుతుండగా కోతి దాడి చేయటంతో ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలేసి వాహన యజమాని పరుగులు తీసిన పరిస్థితి నెలకొందన్నారు. ఇస్లాంపేట, విజయలక్ష్మి పురంలో అధిక సంఖ్యలో కోతులు ఎక్కువగా సంచరిస్తున్నాయని తెలిపారు. సంబంధిత మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి కోతులు పట్టణంలో సంచరించకుండా చూడా లని తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని ప్రధాన రోడ్డు, పలు చోట్ల కుక్కలు ఆవులు కూడా సంచరిస్తూ వాహనదారులను, పాదచారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని తక్షణమే వాటిని అరికట్టాలని సింగరకొండ తెలిపారు.

నేడు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

- మున్సిపల్ కమీషనర్ నిర్మల్‌కుమార్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యన్.టి.ఆర్. భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పథకంకు సంబంధించి సెప్టెంబర్ నేల పింఛన్లను శనివారం ఉదయం యధావిధిగా పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ తెలిపారు. 1వ తేదీ ఆది వారం సెలవు రోజు కావడంతో ఒక రోజు ముందుగానే పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఉదయం 6 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పింఛన పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. బాపట్ల పురపాలక సంఘ పరిధిలో గల అన్ని వార్డు సచివాలయంలో సామాజిక భద్రతా పింఛన్లు, వృద్దులు, వితంతువులకు రూ. 4,000లు వికలాంగుల పింఛన్లు రూ. 6,000లు పెరాలసిస్ పింఛను రూ. 15000లు, డయాలసిస్ పేషంట్లకు రూ. 10,000 చొప్పున పురపాలక సంఘ పరిధిలో పై తెలిపిన వివిధ రకాలైన సామాజిక భద్రత పింఛన్లు మొత్తము 6,528 మందికి గాను సుమారుగా రూ. 2,78,51,500లు పింఛన్లు సొమ్మును నిధులు కేటాయించబడినవి తెలిపారు. 141 మంది సచివాలయ సిబ్బంది పురపాలక సంఘ సిబ్బందితో పాటు 5గురు పర్యవేక్షణాధికారులు పింఛన్లు 31వ తేదిన ఉదయం గం 6.00ల నుండే ఫించనుదారులు ఇంటి వద్దకు వచ్చి పెన్షన్ సొమ్మును పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. పింఛన్‌దారులు అందరూ తమ ఇంటి వద్దనే అందుబాటులో ఉండి సకాలములో పెన్షన్ పొందలని కమిషనర్ కోరారు.

కాలువలో పడి వృద్ధురాలు మృతి

విశాలాంధ్ర-కొల్లూరు: పంట కాలువలో పడి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండల కేంద్రం కొల్లూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. కొల్లూరుకు చెందిన చొప్పర కరుణమ్మ (73) గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. ఆమె ఇద్దరు కూతుర్లు ఇతర ప్రాంతాలలో ఉండటంతో కొల్లూరులో ఉన్న తన సోదరి మేరితో కలసి ఉంటుంది. నాలుగు రోజుల క్రితం మేరీ కుమారి ప్రమాదవశాత్తు పడి చేతికి గాయమవడంతో తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చేరి చికిత్స పొందుతుంది. మూడు రోజుల నుంచి వృద్దురాలు కనిపించకపోవడంతో సమీప గృహాలకు చెందిన వారు పరిసర ప్రాంతాలలో గాలించారు. అయితే శుక్రవారం వృద్దురాలి మృతదేహం ఎస్సీ కాలనీ సమీపంలోని పంట కాలువలో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతురాలి సోదరి మేరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు జరుపుతున్నారు. అనారోగ్య సమస్యల కారణంగా వృద్దురాలు ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని పో లీసులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

నర్సరీలకు లైసెన్సు తప్పనిసరి

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని తాటిచెర్ల మోటు వద్ద ఉన్న నర్సరీలను ఉద్యానశాఖ అధికారి విష్ణుప్రియ శుక్రవారం తనిఖీ చేశారు. నర్సరీలకు లైసెన్సు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. చీడ పురుగులు మరియు తెగుళ్ల యాజమాన్యం చేసి నాణ్యమైన మొక్కలను రైతులకు అందించడమే నర్సరీల చట్టం ముఖ్య ఉద్దేశం అని తెలియజేశారు. కొత్తగా లైసెన్సు కోసం దరఖాస్తు చేసిన నర్సరీలను తనిఖీ చేసి వాటిలో పెంచుతున్న నారు నాణ్యతను ఆమె పరిశీలించారు. నర్సరీలు రిజిస్ట్రేషన్ చేసుకుని రిజిష్టర్ లను నిరహించాలి తెలియజేశారు. మొక్కల ఎదుగుదలను బట్టి ఎరువుల అందించాలని. చీడ పురుగులు నివారణ కోసం తగిన చర్యలు తీసుకోవాలి అని సూచించారు. మొక్కలను అమ్మినప్పుడు రైతులకు రసీదులను అందించాలని తెలియజేశారు.